క్లుప్తంగా

రోడ్ల అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు



ఎమ్మెల్యే గాంధీని కలిసిన అసోసియేషన్ ప్రతినిధులు

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ పరిధిలో సాయిరాంనగర్ కాలనీలో రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ రూ.50 లక్షలు మంజూరు చేశారు. శనివారం కాలనీ వాసులు గాంధీని కలిసి రోడ్లు వేయాలని కోరడంతో అధికారులతో మాట్లాడి వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. కార్యక్రమంలో నల్లగండ్ల హుడా కాలనీ అధ్యక్షుడు మంత్రిప్రగడ సత్యనారాయణ, సాయిరాం కాలనీ అధ్యక్షులు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

ఔషధ ఆవిష్కరణలో ఎన్‌ఎంఆర్ పాత్ర

పటాన్‌చెరు టౌన్: నిర్మాణ ఆధారిత ఔషధ ఆవిష్కరణ కోసం వివిధ రకాల అణు అయస్కాంత ప్రతిధ్వని (ఎన్‌ఎంఆర్) నమూనాలను అభివృద్ధి చేసినట్లు భటిండాలోని పంజాబ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగం అధ్యాపకుడు డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు.గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో శనివారం ఆయన ఎన్‌ఎంఆర్ సాధనంగా ఔషధ తయారీపై ఆతిథ్య ఉపన్యాసం ఇచ్చారు. రసాయన సమ్మేళనాలను ప్రత్యక్షంగా పరిశీలించడం, జీవఅణువులను లక్ష్యంగా చేసుకోవడంతో పాటు లిగాండ్, ప్రోటీన్ ఆధారిత విధానాలను ఉపయోగించడం వంటి ఇతర పద్ధతుల కంటే ఎన్‌ఎంఆర్ అనేక ప్రయోజనాలను అందిస్తుందని ఆయన స్పష్టీకరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

జాతరకు ఏర్పాట్లు పూర్తి



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ,సాయి గణేష్ కాలనీలో ఆదివారం జరగనున్న బోనాల ఉత్సవాలకు దేవాలయాల వద్ద ఏర్పాట్లు చేసినట్లు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ తెలిపారు. శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలో బోనాల ఉత్సవాలు జరిగే పోచమ్మ తల్లి దేవాలయం వద్ద పారిశుధ్య పనులను చేయించారు.

ఉచిత వైద్యశిబిరం



హఫీజ్‌పేట్ : కల్వరి టెంపుల్ ఆధ్వర్యంలో మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్‌లో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు.ఈ శిబిరాన్ని కల్వరి టెంపుల్ ఆసుపత్రి డాక్టర్ పి.రాజేష్ కుమార్, కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్ ప్రారంభించారు. ప్రజలు వైద్య శిబిరంను సద్వినియోగం చేసుకోవాలన్నారు.బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్, ప్రభాకర్, ప్రసాద్, మల్లారెడ్డి, హాస్పటల్ పీఆర్‌ఓ జయరాం, అడ్మినిస్ట్రేటివ్ రాజా తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న బండి రమేష్

మియాపూర్ : మియాపూర్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి రమేష్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కార్యకర్తలు, నాయకులు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ యువసేన ఆధ్వర్యంలో భారీ గజమాలతో ఆయనను సత్కరించారు.మియాపూర్ ఆల్విన్ కాలనీ చౌరస్తా నుండి పార్టీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. పుట్టినరోజు సందర్భంగా ఉచిత వైద్యశిబిరాలు, మహిళలకు చీరల పంపిణీలు చేశారు.

కొవిడ్ టెస్టులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం 12 మందికి కొవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. అదేవిధంగా 10 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు.

ఐటీ రోడ్లు అధ్వానం

- ప్రధానరోడ్లు గుంతలమయం
- నామమాత్రపు మరమ్మతులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులుపడుతున్న వాహనదారులు, పాదచారులు





మాదాపూర్: ఐటీ ప్రాంతంగా పేరు పొందిన మాదాపూర్ పరిసర ప్రాంతాలలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. కొద్దిపాటి వర్షం పడిందంటే చాలు నీరు నిలుస్తోంది. రోడ్లు గుంతలమయంగా మారడంతో నీరు నిల్వ ఉండి రాకపోకలకు వాహనదారులు, పాదచారులు ఇబ్బందిపడుతున్నారు. మాదాపూర్‌లోని చంద్రనాయక్‌తండా, సాయినగర్, సర్వేఆఫ్ ఇండియా, గఫూర్‌నగర్ తదితర ప్రాంతాలలో రోడ్లు గుంతలమయంగా మారాయి.

- మాదాపూర్‌లోని ప్రధాన రహదారులు కొద్దిపాటి వర్షానికే ఛిద్రమవడంతో పాటు గుంతలుపడ్డాయి.
- వర్షాకాలం ప్రారంభమవడంతో జీహెచ్‌ఎంసీ సిబ్బంది పనులు చేస్తున్నా అవి నామమాత్రంగా ఉన్నాయని, నాణ్యత లేకపోవడంతో వేసిన పదిరోజులకే తిరిగి యథాస్థితి అని స్థానికులు వాపోతున్నారు.
- పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని చెప్పారు. నాయకులు, అధికారులు పర్యటిస్తున్నా సమస్యలు పరిష్కారమవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.
- అంతర్జాతీయ సదస్సులకు నిలయంగా మారిన మాదాపూర్‌లో రోడ్లు ఇలా ఉంటే మిగిలిన ప్రాంతాల పరిస్థితి ఏమిటని ప్రజలు విమర్శిస్తున్నారు
- రోడ్లపై గుంతలు ఏర్పడడంతో రాత్రి సమయాలలో ఎక్కడ గుంత ఉందో తెలియక వాహనదారులు భయపడుతున్నారు. వాహనాలు గుంతల్లో పడి చెడిపోతున్నాయని పేర్కొన్నారు.
- సంబంధిత అధికారులు, నాయకులు రోడ్ల సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



మాదాపూర్‌లోని చంద్రానాయక్ తండా ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

కాలనీలోకి వెళ్లాలంటే భయంగా ఉంది



ఈ రోడ్లపై పిల్లలను, పాఠశాలలకు తీసుకు వెళ్లడం ఇబ్బందిగా ఉంది. చిన్నారులను వాహనాలపై తీసుకు రావాలంటే భయంగా ఉంది. గుంతల్లో నీరు నిలవడం దీనికితోడు చెత్తాచెదారం గాలికి వచ్చి చేరడంతో దుర్వాసన వస్తోంది. అసలే వర్షాకాలం సమస్య పరిష్కరించాలి.

–దత్తాత్రేయ, స్థానికుడు

గోపన్‌పల్లిలో కార్పొరేటర్ పర్యటన



అవంతిక గోదావరి అపార్ట్‌మెంట్స్ ప్రాంతంలో పర్యటిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. గోపన్‌పల్లిలోని అవంతికగోదావరి అపార్ట్‌మెంట్‌వాసులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ఆ ప్రాంతంలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవంతిక గోదావరి అపార్ట్‌మెంట్స్ ప్రాంతంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, సీసీరోడ్లు, మంచినీటి సరఫరా, విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను ఫోన్ ద్వారా అధికారులకు వివరించారు. కార్యక్రమంలో అవంతికగోదావరి అపార్ట్‌మెంట్స్ అధ్యక్షుడు ఇంద్రారెడ్డి, సభ్యులు కరుణ, దేబాశిష్, కిరణ్‌కుమార్, సతీష్‌కుమార్, కిరణ్‌కుమార్, నగేష్,శ్రీహర్ష, సంపత్, సతీష్‌కుమార్, రాజేష్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

‘వాహ్ కార్ట్’ను ప్రారంభించిన ఎమ్మెల్యే

హఫీజ్‌పేట్ : మాదాపూర్ డివిజన్ గోకుల్‌ప్లాట్స్‌లో ‘వాహ్ కార్ట్’ షాపింగ్ స్టోర్‌ను ఎమ్మెల్యే గాంధీ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి కాలంలో యువత ఆన్‌లైన్ షాపింగ్ చేస్తున్నారని వాహ్ కార్ట్ ద్వారా ఆన్‌లైన్‌లో నాణ్యమైన దుస్తులు, జువ్యెలరీ ఉత్పత్తులను స్థానిక ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్, డైరెక్టర్లు పూజ, గణేష్, రాజేష్‌వర్మ, కిరణ్, వాహ్ కార్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా..

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని నందమూరినగర్‌లో చేపడుతున్న వరద నీటి కాల్వ నిర్మాణ పనులను ఆయన ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేస్తున్న రవికుమార్ యాదవ్

మియాపూర్ : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సందయ్య మెమోరియల్ ట్రస్ట్ సెక్రటరీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. మియాపూర్‌లోని జడ్పీ హెచ్‌ఎస్ పాఠశాలలో సందయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు ఉచిత నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. ఉపాధ్యాయుల బోధన సులభతరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రసాద్, వినోద్‌రావు, నాగులుగౌడ్, మాణిక్యం, ప్రసాద్, సురేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం



యూజీడీ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ హమీద్‌పటేల్ తదితరులు

- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ
- అంజయ్యనగర్‌లో యూజీడీ పనులకు శంకుస్థాపన

గచ్చిబౌలి: డ్రైనేజీ వ్యవస్థను శాశ్వతంగా పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. కొండాపూర్ డివిజన్‌లోని అంజయ్యనగర్‌లో ఆయన రూ.22 లక్షలతో చేపట్టనున్న యూజీడీ నిర్మాణ పనులకు కార్పొరేటర్ హమీద్ పటేల్‌తో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లిలోని కాలనీలు, బస్తీలలో డ్రైనేజీ సమస్యలను పరిశీలించామని శాశ్వత పరిష్కారం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం శరత్‌రెడ్డి, మేనేజర్ యాదయ్య, నాయకులు రవీందర్ ముదిరాజ్, శ్రీనివాస్‌యాదవ్, బలరామ్‌యాదవ్, నర్సింహ్మసాగర్, షేక్‌చాంద్‌పాషా, జంగంగౌడ్, తిరుపతిరెడ్డి, ప్రసాద్, రమేష్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పటాన్‌చెరు: గొల్ల కురుమల ఆర్థిక స్వావలంబన కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.రెండవ విడత గొర్రెల పంపిణీలో భాగంగా శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీలో బండ్లగూడ, రామచంద్రాపురం డివిజన్లకు సంబంధించిన 12 మంది లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, పశు వైద్య అధికారి వంశీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జన ఆరోగ్య సమితి కమిటీ సమావేశం

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన జన ఆరోగ్యసమితి కమిటీ మొదటి సమావేశం శనివారం కార్పొరేటర్ కార్యాలయంలో జరిగింది. జన ఆరోగ్య సమితి కమిటీ చైర్‌పర్సన్, డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిటీ సెక్రటరీ డాక్టర్ మను పప్పన్, జన ఆరోగ్య సమితి సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జీహెచ్‌యంసీ పరిధిలోని వైద్య, విద్య, శానిటేషన్, ఎంటమాలజి వంటి వివిధ శాఖల అధికారులను ఎన్నుకొని జన ఆరోగ్య సమితి కమిటీని ఏర్పాటు చేశామన్నారు.

దుర్గం చెరువులో ఫైర్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ



డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ గిరిధర్‌రెడ్డి, విజయ్‌కుమార్, రఫీ, క్రాంతి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జగన్‌మోహన్, ఫాజల్ తదితరులు పాల్గొన్నారు.

మాదాపూర్: వరదల్లో, నీటిలో పడ్డవారిని ఏ విధంగా రక్షించాలో ఇండియన్ రెస్క్యూ అకాడమీ బృందం ఫైర్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. శనివారం మాదాపూర్‌లోని దుర్గం చెరువులో 65 మంది ఫైర్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. వాటర్ రెస్క్యూ ఆపరేషన్ టీం డెమోను నిర్వహించారు. వరదలు, ముంపులు వచ్చినప్పుడు బోట్‌లపై వెళ్ళి ఏ విధంగా కాపాడాలో అవగాహన కల్పించారు. డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ వెంకన్న మాట్లాడుతూ నాణ్యమైన శిక్షణ తీసుకున్నప్పుడే మంచిఫలితాలు వస్తాయని తెలిపారు. అనంతరం బోట్‌లపై వివిధ విన్యాసాలతో సందర్శకులను అలరించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ శ్రీధర్‌రెడ్డి, సందేష్, అడిషనల్

టీ9 గోల్ఫ్ ఛాలెంజ్ సంయుక్త విజేతలు సిమెట్రిక్స్, బౌల్డర్ హిల్స్ టైగర్స్

సాక్షి, సిటీబ్యూరో: టీ9 గోల్ఫ్ ఛాలెంజ్ రెండో సీజన్‌లో సిమెట్రిక్స్, బౌల్డర్ హిల్స్ టైగర్స్ సంయుక్త విజేతలుగా నిలిచాయి. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ 4–4 స్కోర్ తో టై అయింది. డిఫెండింగ్ ఛాంపియన్ బౌల్డర్ హిల్స్ టైగర్స్ ఆరంభంలో ఆధిక్యంలో నిలిచినా...తర్వాత సిమెట్రిక్స్ టీమ్ పుంజుకుంది. స్కోర్ సమం కావడంతో ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇరు జట్లను సంయుక్త విజేతలుగా ప్రకటించారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఇరు జట్ల కెప్టెన్లకు ట్రోఫీతో పాటు 5 లక్షల రూపాయల ప్రైజ్ మనీ చెక్ ను అందజేశారు. అంతకు ముందు మూడో స్థానం కోసం జరిగిన ప్లే ఆఫ్ మ్యాచ్ లో జాగృతి జాగ్వర్స్ 3–1 స్కోర్ తో ఎకోలాస్టిక్ ఈగల్స్ పై విజయం సాధించింది. కాగా గోల్ఫ్‌ను మరింత ప్రమోట్ చేసే ఉద్దేశ్యంతో ఈ ఛాంపియన్ షిప్ నిర్వహిస్తున్నామని టీ గోల్ఫ్ ఫౌండర్ ఎస్ఆర్ ఎన్ రెడ్డి చెప్పారు.

హైటెక్స్‌లో హైదరాబాద్ డెంటల్ షో

రెండు రోజుల పాటు వర్క్‌షాప్‌లు, సదస్సులు



మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న హైదరాబాద్ డెంటల్ షో(హెచ్‌డీఎస్)ను ఉమెన్ సేఫ్టీ వింగ్, షీటీమ్స్, భరోసా ఏడీజీపి శిఖాగోయల్ శనివారం ప్రారంభించారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ హెచ్‌ఓ అధ్యక్షుడు డాక్టర్ రాజీవ్ కె.చుగ్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించనున్న డెంటల్ షోలో దంత వైద్య నిపుణులు హాజరుకానున్నట్లు తెలిపారు. సదస్సులో ప్రాక్టీషనర్లు, విద్యావేత్తలు, విద్యార్థులు, డెంటల్ ఎక్విప్‌మెంట్, మెటీరియల్, ల్యాబ్‌లు, తయారీదారులు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. ప్రదర్శనలో భాగంగా పాటలు, నృత్యం, ఫ్యాషన్ షో, యాడ్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐడీఏహెచ్‌ఓ సెక్రటరీ జనరల్ డాక్టర్ అశోక్ ధోబ్లే, డబ్ల్యూడీసీ చైర్ పర్సన్ డాక్టర్ అనుగిరిధర్, డబ్ల్యూడీసీ సెక్రటరీ డాక్టర్ మనీషా గరుడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు..

రామచంద్రాపురం (పటాన్‌చెరు) : తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీవిజయదుర్గ పెద్దమ్మ తల్లి బోనాల మహోత్సవంను ఆలయ వ్యవస్థాపకులు కొల్లూరి సత్తయ్య, కౌన్సిలర్ కొల్లూరి భరత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లాపూర్ నుంచి ఆలయం వరకు బోనాలతో, పోతురాజుల ఆటపాటలతో భారీ ఊరేగింపుగా వచ్చారు. ప్రత్యేక పూజ కార్యక్రమంలో జోగిని శ్యామల, మున్సిపల్ చైర్‌పర్సన్ లలితసోమిరెడ్డి, రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పనగేష్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

లోన్ తీర్చాలంటూ వేధింపులు

పటాన్‌చెరు టౌన్: లోన్ తీసుకున్నావ్.. తీర్చాలంటూ సైబర్ నేరగాళ్లు వేధిస్తున్నారంటూ ఓ వ్యక్తి పటాన్‌చెరు పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామానికి చెందిన సత్యనారాయణ ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు.ఈనెల 4వ తేదీన తన ఫోన్‌కు మెసేజ్, ఫోన్ రాగా సత్యనారాయణ మాట్లాడితే నీవు రుణం తీసుకున్నావు వెంటనే నగదు చెల్లించాలని చెప్పడంతో వెంటనే చార్జీల కింద రూ.200 జమ చేయాలని చెప్పడంతో భయపడి సత్యనారాయణ జమచేశాడు.అనంతరం ఎక్కడా తను రుణం తీసుకోలేదని ధ్రువీకరించుకున్న తర్వాత అవతల నుంచి ఫోన్ చేసినా సత్యనారాయణ స్పందించలేదు. దీనితో బాధితుని తల్లి, చెల్లిని ప్రస్తావిస్తూ అసభ్యకర మెసేజ్‌లు పెడతామని శనివారం ఉదయం నుంచి ఫోన్లు రావడంతో సైబర్‌సెల్‌లో ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా ప్రభుత్వ విద్యాసంస్థలను తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గ్లాండ్ ఫార్మా పరిశ్రమ సహకారంతో 3 కోట్ల 20 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన 14 అదనపు తరగతులు, క్యాంటీన్ గదులను ఎమ్మెల్యే ప్రారంభించారు. పాఠశాలకు కావలసిన పూర్తిస్థాయి ఫర్నిచర్‌ను పరిశ్రమ పాఠశాలకు అందజేసింది.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం.. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని తెలిపారు. పటాన్‌చెరు పట్టణాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దామని తెలిపారు. సమాజ సేవలో పరిశ్రమల యాజమాన్యాలు మరింత ముందుకు రావాలని కోరారు.ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, మండల విద్యాధికారి రాథోడ్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు





మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా కర్ణాటక రాష్ట్రానికి చెందిన ప్రముఖ భరతనాట్య కళాకారిణి మిలన్‌బీవీ నృత్యప్రదర్శనతో అలరించింది. ఇందులో గజవదన, రాజీవలోచన, సభాపతి అంశాలను ప్రదర్శించింది. కూచిపూడి నృత్యప్రదర్శనలో భాగంగా గురువు సంధ్య కార్తీక్ శిష్యబృందం మూషికవాహన, తాండవ నృత్యకారి, జతిస్వరం, రామాయణశబ్దం, ఆనందతాండవం, భామాకలాపం ప్రదర్శనలతో అలరించారు. కళాకారులు లాస్య, యుక్తిక, తన్వి, అక్షయ, ఉషశ్రీ, సాత్విక, సంహిత, ధన్యశ్రీ, దీక్షలు పాల్గొన్నారు.

అన్నమయ్యపురంలో..

అన్నమయ్యపురంలో నిర్వహిస్తున్న అన్నమయ్య స్వరార్చనలో భాగంగా శనివారం పద్మజారెడ్డి శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఇచ్చారు. ఇందులో పుష్పాంజలి, కృష్ణశబ్దం, జణుత శబ్దం, చక్కని తల్లికి చాంగుభళా, తదితర కీర్తనలను ప్రదర్శించారు. అన్నమాచార్య భావనవాహిని సంస్థ అధ్యక్షులు డాక్టర్ శోభారాజు వారిని జ్ఞాపికలతో సత్కరించారు.

నేడు చిత్తారమ్మ బోనాల జాతర

- జాతరలో పోతరాజుల విన్యాసాలు... శివసత్తుల నాట్యాలు
- బోనంతో మొక్కులు చెల్లించుకోనున్న మహిళా భక్తులు



కూకట్‌పల్లిలోని శ్రీ చిత్తారమ్మ దేవాలయం, అమ్మవారు

ఆల్విన్ కాలనీ : కూకట్‌పల్లి ప్రజల ఇలవేల్పు శ్రీ చిత్తారమ్మ తల్లి బోనాల వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విలసిల్లే తల్లిగా శ్రీ చిత్తారమ్మ అమ్మవారిని ప్రజలు కొలుస్తారు. సుమారు వంద సంవత్సరాలకు పైగా భక్తుల నుంచి పూజలను అందుకుంటున్న చిత్తారమ్మ ఆలయాన్ని బోనాల జాతరను పురస్కరించుకుని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఆదివారం ఉదయం 4 గంటల నుంచే అమ్మవారి పూజలు జరుగనున్నాయి. అదే విధంగా వాహన పూజలు, పొట్టేళ్ల, తొట్టెల ఊరేగింపులు, డప్పు దరువులు, పోతరాజుల నృత్యాలు, శివసత్తుల వీరంగాలతో వేడుకలు సాగనున్నాయి. సాయంత్రం 3 గంటల నుంచి సామూహిక బోనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. పలువురు ప్రముఖులు, రాజకీయ వేత్తలు బోనాల వేడుకల్లో పాల్గొననున్నారు.